చిరునామా ఒకచోట.. నిర్వహణ మరోచోట







49వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో నిర్వహిస్తున్న బర్మా కాలనీ, కె.కాలనీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు (నేమ్ బోర్డుపై మారని వార్డు నంబర్, చిరునామా)

మురళీనగర్: జీవీఎంసీ పరిధిలో పాత వార్డుల స్థానంలో కొత్త వార్డులు ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా.. మురళీనగర్ ప్రాంతంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల చిరునామాలను నేటికీ మార్చలేదు. చిరునామా ఒకచోట కాగా.. కార్యకలాపాలు మరోచోట నిర్వహిస్తున్నారు. నేమ్ బోర్డుల్లో మారిన వార్డు నంబర్లను నేటికీ మార్చక పోవడంపై స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలల నేమ్ బోర్డులు కూడా మార్చకపోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. వార్డులు మారినా వాటి చిరునామా మార్చకపోవడంపై అధికారులు దృష్టి సారించలేదు. దీంతో నేమ్ బోర్డులపై పాత చిరునామాలే దర్శనమిస్తున్నాయి.

మారని పాఠశాలల నేమ్ బోర్డులు

జీవీఎంసీ 49, 50 వార్డుల్లోని మురళీనగర్ పరిధిలో నిర్వహిస్తున్న జీవీఎంసీ పాఠశాలల చిరునామా పేర్లు నేటికీ మార్చలేదు. జీవీఎంసీ వార్డుల పునర్విభజనలో భాగంగా గతంలో ఉన్న విశాలమైన 38వ వార్డును రెండుగా జీవీఎంసీ ఏర్పాటు చేసింది. అటు బర్మా క్యాంప్ నుంచి ఇటువైపు సత్యానగర్ వరకు ఉన్న ప్రాంతాన్ని 49వ వార్డుగా.. సత్యానగర్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాల నుంచి మాధవధార, మన్యం, మురళీనగర్ సెక్టార్–5 నుంచి 13, బాలాజీ గుడి కొండ, కనకదుర్గా కల్యాణ మండపం రోడ్డు నుంచి రామాలయం రహదారి వరకు కలిపి 50వ వార్డును ఏర్పాటు చేశారు. వీటి పరిధిలోని రెండు జీవీఎంసీ పాఠశాల నేమ్ బోర్డుల్లో వార్డు నంబర్లు మార్చలేదు. గతంలో మురళీనగర్, మాధవధార ప్రాంతాలు 39వ వార్డులో ఉండటంతో మురళీనగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను అప్పట్లో నాడు– నేడు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బోర్డులో 39వ వార్డునే ప్రస్తావించారు. జీవీఎంసీ ఎన్నికల నాటికి ఈ వార్డు 50వ వార్డుగా మారినా.. నేమ్ బోర్డులో వార్డు నంబర్ మార్చలేదు. ప్రస్తుతం 49వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో ఏర్పాటు చేసిన బర్మా క్యాంప్ ప్రాథమిక పాఠశాల పేరు, వార్డును మార్చలేదు. ఇది ఇప్పటికీ 38వ వార్డులో ఉన్నట్లే బోర్డులో పేర్కొన్నారు. ఈ ప్రాంగణంలోకి మార్చిన కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల చిరునామా మార్చలేదు. ఏఎస్సార్ నగర్‌లో ఉంటూ కె.కాలనీ పేరుతోనే ఈ స్కూల్ నడుస్తోంది.



బర్మా క్యాంప్‌లో నిర్వహిస్తున్న మద్రిపాలెం అగ్నిమాపక కేంద్రం

ఏళ్ల తరబడి మార్చకుండా..

బర్మా క్యాంప్‌లో నిర్వహిస్తున్న మద్రిపాలెం అగ్నిమాపక కేంద్రం చిరునామా ఏళ్ల తరబడి ఇలాగే కొనసాగుతోంది. అగ్నిమాపక కేంద్రం ప్రస్తుతం 38వ వార్డులో ఉంది. సుమారు 10 వార్డుల్లోని ప్రాంతాలకు సేవలందిస్తున్న అగ్నిమాపక కేంద్రం చిరునామా మార్చాల్సి ఉంది. దీనిపై అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



50వ వార్డులోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల నేమ్ బోర్డులో పాత వార్డు నంబర్

కుంచుమాంబ పండగకు సీపీకి ఆహ్వానం



పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

మురళీనగర్: మాధవధారలో కొలువైన కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండగకు రావాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు పప్పల రామచంద్రరావు, ఎస్.డి.వి.రమణమూర్తి, కోన వెంకటరావు, లక్ష్మీకాంత్ ఆదివారం సీపీని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ మేరకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఎంపీ భరత్‌ను వీరు ఆహ్వానించిన మేరకు వారు అంగీకరించారు. ఈ నెల 8న మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు.

చందనం సమర్పణకు విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం కొనుగోలు నిమిత్తం విజయవాడకు చెందిన కెపీఎల్ హరినాథ్ రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ఆచార్యులుకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు రశీదు అందించారు. ఆలయ ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మొహర్రం ప్రార్థనలు



ప్రత్యేక పానీయం, ఆహార పదార్థాలను సిద్ధం చేసిన ముస్లింలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ మసీదు ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో ఆదివారం మొహర్రం ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ముస్లింలు మసీదులో ఖురాన్ పఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మసీదు ప్రాంగణంలో హఫీజ్(ముస్లిం మత గురువు) తక్రీర్ పఠించారు. కార్యక్రమంలో భాగంగా పాలు, బెల్లం, పుట్నాలతో తయారు చేసిన ప్రత్యేక పానీయాన్ని ముస్లింలు స్థానికులకు పంపిణీ చేశారు.

నవ్వుల్లో ముంచెత్తిన కామెడీ షో



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతి నెలా మొదటి ఆదివారం నిర్వహించే వినోదాల విందు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించిన కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, పోర్టు శేషు, కుమారి, పుష్పమి, నాయుడు, రామానుజం, భానుప్రకాష్, సూర్యం, శివజ్యోతి, రాగస్ నాయుడు, నరసింహరావు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ఆహుతులను కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో సర్దుకు పోదాం రండి, స్విమ్మింగ్‌పూల్, జామచెట్టు, తాగుబోతు, కోడిపందాలు, డాక్టర్ పేషెంట్, డ్రైవర్ జాబ్, ప్రశాంతత, రెండు వేల నోటు స్కిట్స్ నవ్వుల్లో ముంచెత్తాయి. ముందుగా వాగ్దేవి నృత్యాలయం గురువు సౌందర్య సురేష్ శిష్య బృందం హరిప్రియ, జాహ్నవి, వైద్య, మౌనిక, గిరిష్మా చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డ్రీం షెల్టర్స్ అధినేత రవిశంకర్, సన్‌మూర్తి, తిలక్ పట్నాయక్, బి.మాల్యాద్రి చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.


వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావణకుమార్

మురళీనగర్: మహిళా వాకర్స్ క్లబ్, ఈస్ట్ పార్క్ సంయుక్తంగా మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ శ్రావణ కుమార్ 80 మందికి బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. వర్షా కాలంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. క్లబ్, అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల, ఎడిటర్ డి.శిరీష, ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి, జాలీవాకర్ కె.సుగుణ, కార్యవర్గ సభ్యులు పూర్ణిమ, నిహారిక, ఈస్ట్ పార్కు సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.

గురుపూజోత్సవానికి ఏర్పాట్లు



భానుప్రకాష్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న అర్చకుడు రామశాస్త్రి

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయిబాబా మందిరంలో ఈ నెల 10న నిర్వహించనున్న గురుపూజోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. వాకర్స్, వాకర్స్ క్లబ్ సభ్యులు, మానవ సేవే మాధవ సేవ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్, సభ్యులకు ఆలయ అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆహ్వాన పత్రికలు అందించారు. గురుపూజోత్సం పర్వదినాన షిర్డీసాయికి 108 కలశాలతో నిర్వహించనున్న కలశారాధనలో పాల్గొనాలని ఆయన కోరారు.

చిరస్మరణీయుడు జగ్జీవన్ రామ్



కప్పరాడలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు



హరిజన వీధిలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంపంగి శ్రీనివాసరావు



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

కంచరపాలెం: దళితుల అభ్యున్నతికి సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ చేసిన కృషి అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. పార్టీ నార్త్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దొండపర్తి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆదివారం 47వ వార్డు కప్పరాడలో జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ దళితుల ఆశాజ్యోతిగా జగ్జీవన్ రామ్ ప్రజలందరి గుండెల్లో నిలిచే ఉన్నారని, అణగారిన వర్గాల అభ్యున్నతి, సమాజ స్థాపనలో అలుపెరగని కృషి చేశారన్నారు. నేటి యువత ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ముందుగా ఆయా ప్రాంతాల్లోని జగ్జీవన్ రామ్ విగ్రహాలకు కె.కె.రాజు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు సుందిరి సుకుమార్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గార కృప, సీనియర్ నాయకులు బి.సురేష్, చందు, అనిల్, నాగరాజు, రమేష్, సాయి, రవీంద్ర, దిల్లేశ్వర్, గంగరాజు, రవి, స్వామి, కార్యకర్తలు, దళిత నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ సేవలు నిరుపమానం

సీతంపేట: గాంధీ హరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 25వ వార్డు సీతంపేట హరిజన వీధిలో బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అక్కడి జగ్జీవన్ రామ్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సింహాచలం దేవస్థానం బోర్డు మాజీ సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ తొలి దళిత ఉప ప్రధానిగా జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ వేత్తగా, భారత పార్లమెంట్‌లో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాక.. ఉప ప్రధానిగా సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో జోరీగల గణేష్, కొమ్ము నాగు, మొండూరి అప్పలరాజు, జామి ప్రభాకర్, అందులూరి సూరిబాబు, మిర్యాల రవికుమార్, మహేష్, భవాని, లావణ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ అధికారుల నివాళి

జగదాంబ: గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి చీఫ్ జనరల్ మేనేజర్ రామచంద్రరావ్, బి.అశోక్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, పార్లమెంటేరియన్‌గా, ఉప ప్రధానిగా కేబినెట్‌లో అనేక కీలక శాఖల్లో ఆయన సేవలందించారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధిగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలి

మద్దిలపాలెం: పెంపుడు శునకాలకు క్రమం తప్పకుండా ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలని పశు వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్‌రావు సూచించారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం ఇసుకతోట పశు వైద్య కేంద్రంలో పెంపుడు శునకాలకు వ్యాక్సిన్లు వేశారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలు మనుషులకు అతి సన్నిహితంగా ఉంటాయి కనుక వాటి నుంచి త్వరగా రేబిస్ సోకుతుందన్నారు. జీవీఎంసీ సిబ్బంది వీధి కుక్కలకు సంక్షేమ ఆపరేషన్లు చేస్తున్నారని, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు కూడా వేస్తున్నారన్నారు. జేడీ కార్యాలయం వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రసాదరావు వైద్య కేంద్రం డాక్టర్ ఎస్.జి.ప్రశాంతి మాట్లాడుతూ నగర పరిధిలోని అన్ని పెంపుడు కుక్కలకు యజమానులు విధిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా 224 శునకాలకు వ్యాక్సిన్ వేశారు. వైద్య కేంద్రం సిబ్బంది కరుణ, అప్పన్న పాల్గొన్నారు.

అన్నార్తులకు ఆహారం పంపిణీ



పేదలకు ఆహారం ప్యాకెట్లు అందజేస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: దళిత సేన ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన కింద, జ్ఞానాపురం రైల్వే స్టేషన్, దొండపర్తి, తాటిచెట్లపాలెం, మద్రిపాలెం, ఎన్ఏడీ తదితర ప్రాంతాల్లో అన్నార్తులకు సామాజిక వేత్త, దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆహారం పొట్లాలు పంపిణీ చేశారు. సుమారు 450 మందికి ఆహారం అందజేశారు. ఆకలితో ఉన్న అభాగ్యులకు సహాయం చేయడానికి ఎల్లవేళలా ముందుంటానని అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ మీనా, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, నగర సెక్రటరీ పట్నాల ఝాన్సీ, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లకు సమయపాలన తప్పనిసరి

అల్లిపురం: బార్ అండ్ రెస్టారెంట్, మద్యం దుకాణాల యాజమాన్యం, సిబ్బంది సమయపాలన పాటించాలని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సూచించారు. బార్ అండ్ రెస్టారెంట్, మద్యం దుకాణాల యాజమాన్యం, సిబ్బందితో ఆదివారం ఆయన స్టేషన్ ఆవరణలో సమావేశమయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోమని, బార్ అండ్ రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల ఫుటేజీ కూడా సేవ్ చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



లలితా పీఠంలో ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి



భగవద్గీత పారాయణ చేస్తున్న భక్తులు

సీతంపేట: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, నీరాజనం, మంత్రపుష్పాలు, విశేష అలంకరణ, నక్షత్ర హారతి, దూప దీపాలతో స్వామివారిని పూజించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సామూహిక భగవద్గీత పారాయణ చేశారు. సుమారు మూడు గంటల పాటు ఏకదాటిగా 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను పఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున వైభవుడికి ఉదయాస్తమాన సేవలు చేశారు. ఉదయం 9 గంటలకు తులసీదళార్చన, 10 గంటలకు స్వామికి సామూహిక విష్ణు సహస్రనామార్చన భక్తులు జరిపారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి వెళ్లి వైభవుడిని దర్శించుకున్నారు. స్వామికి అభిషేకాలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరి నామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ నామస్మరణతో సాగరనగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయ్ సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించి, పలు ప్రవచనాలు అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలను పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కీర్తనలు ఆలపిస్తూ, స్వామివారి దర్శనం చేసుకుని పునీతులయ్యారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామ్‌ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పార్టీ శ్రేణులు

తాటిచెట్లపాలెం: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు, దేశ ఐక్యత కోసం అసమాన కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఆదివారం సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశభక్తి, త్యాగం, జాతీయ సమైక్యత కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరుణ్‌బాబు, ఆశీర్వాదం, అనిల్, దుర్గారావు, ప్రసాద్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: రౌడీ షీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని, మంచిగా మెలగాలని ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో పలువురు రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి గొడవల్లో తలదూర్చకూడదని హితవు పలికారు. సమాజంలో హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని రౌడీ షీటర్లను హెచ్చరించారు.

విస్తృతంగా తనిఖీలు



ఇనార్బిట్ మాల్ ప్రాంతంలో కారును తనిఖీ చేస్తున్న ఫోర్త్ టౌన్ పోలీసులు

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ సత్యనారాయణ నేతృత్వంలో అక్కయ్యపాలెం, సాలగ్రామపురం, ఇనార్బిట్ మాల్ పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

సేవలందిస్తామంటే.. ఇంతటి చిన్నచూపా?

దేవస్థానం, పోలీస్ అధికారులను నిలదీసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సింహాచలం: ఈ నెల 9న గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని పోలీస్‌శాఖ, దేవస్థానం తీసుకున్న నిర్ణయాలపై పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈసారి పెద్ద ఎత్తున ఆంక్షలు విధించడంపై నిరసనగళం వినిపిస్తున్నారు. గోపాలపట్నం నుంచి పాత అడవివరం వరకు, నగరంలో పలు చోట్ల స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే స్టాళ్ల విషయంలో పోలీసులు ఇటీవల పలు ఆంక్షలు విధించారు. గోపాలపట్న నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఏటా మాదిరి రోడ్డును ఆనుకుని కాకుండా పక్కగా ఉండే సందుల్లో స్టాళ్లు ఏర్పాటు చేసుకోవాలని, మెటీరియల్ తీసుకెళ్లేందుకు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. దీంతో ఆదివారం గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో త్రినాథరావులు వారితో పరిపాలన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ నిరసన గళం వినిపించారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఆంక్షలు ఎక్కువగా విధించడాన్ని వ్యతిరేకించారు. తాము ఏర్పాటుచేసే స్టాల్‌కి మెటీరియల్ తీసుకెళ్లేందుకు కూడా వాహనాలకు అనుమతి ఇవ్వకపోవడం సరికాదన్నారు. భక్తుల సేవ చేద్దామంటే చేయనీయకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఈ తరుణంలో గోపాలపట్నం సీఐ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ జరిగే గోపాలపట్నం నుంచి పాత అడవివరం వరకు తీవ్ర రద్దీ ఉంటుందని, దాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రధాన రోడ్డుపై కాకుండా అంతర్గత రోడ్లలో స్టాల్స్ ఏర్పాటుకు సూచించినట్టు స్పష్టం చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా లేని ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెహికల్ పాస్‌లపై స్పష్టత ఇవ్వకుండానే సమావేశాన్ని అర్ధంతరంగా ముగించారు.

ఫిల్మ్ సొసైటీతో విడదీయరాని అనుబంధం



మాట్లాడుతున్న సినిమాటోగ్రాఫర్ రఘు

బీచ్‌రోడ్డు: సినిమా అనేది ఒక గొప్ప ప్లాట్‌ఫామ్ అని, దానిని సరైన మార్గంలో వినియోగించుకోవాల్సిన అవసరం ప్రస్తుత తరానికి ఉందని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఎంవీ రఘు పేర్కొన్నారు. సినిమాటోగ్రాఫర్‌గా ఎంవీ రఘు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సిరిపురంలోని బిల్డర్ అసోసియేషన్ హాల్లో ఘనంగా సన్మానించారు. అనంతరం రఘు మాట్లాడుతూ 50 ఏళ్లుగా సినిమా రంగంలో సేవలందిస్తున్న తనకు ఫిల్మ్ సొసైటీతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. హైదరాబాద్ వంటి నగరంలో సినిమాలంటే ఏంటి, సినిమాటోగ్రాఫర్‌కు ఉండాల్సిన ప్రధానాంశాలపై యువతకు సలహాలు ఇస్తున్నామన్నారు. కళ్లు వంటి చిత్రానికి సినిమాటోగ్రఫీనే కాకుండా, దర్శకత్వం కూడా వహించానన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశ రావు మాట్లాడుతూ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించడమే కాకుండా దానికి దోహదపడ్డ వ్యక్తులను సినీ ప్రియులకు దగ్గర చేయడమే తమ లక్ష్యమన్నారు. ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి బి.చిన్నారావు, ఉపాధ్యక్షులు కృష్ణారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.